క్లుప్తంగా

జేసీబీ సీజ్



జేసీబీని సీజ్ చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నేరడిగొండ: మండలంలోని కుప్టి జాతీయ రహదారికి అనుకొని అక్రమ మొరం తవ్వకాలపై 'యథేచ్ఛగా మొరం తవ్వకాలు' అనే శీర్షికన సోమవారం 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ రమేశ్‌పవర్, మండల గిర్దావర్ ఎం.నాగోరావ్‌లు మొరం తవ్వకాలను అడ్డుకొని జేసీబీని సీజ్ చేశారు. మొరం తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాన్ని సందర్శించి తవ్వకాలపై విచారణ చేపట్టారు. అక్రమ తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నరేశ్

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన పిల్లి నరేశ్ మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం వరంగల్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు జోర్రీగల శ్రీనివాస్ పిల్లి నరేశ్‌ను ఏకగ్రీవంగా ఎంపికచేసినట్లు తెలిపారు. నరేశ్ మాట్లాడుతూ మేదరి మహేంద్ర కుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఘనంగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి

ఉట్నూర్‌రూరల్: మండల బీజేపీ ఆధ్వర్యంలో జన సంఘం వ్యవస్థాపకులు డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. శ్యామాప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. అనంతరం నాగాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలో గల 97 బూత్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రమేశ్, బాలాజీ, రాంచందర్, శేషరావు, తదితరులు పాల్గొన్నారు.

అఖండ జ్యోతి రథయాత్రకు ఘన స్వాగతం



రథయాత్రను దర్శించుకుంటున్న గ్రామస్తులు

నేరడిగొండ: హిందూ ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా కన్యకుమారి నుంచి రామేశ్వరం మీదుగా అయోధ్య వరకు సాగుతున్న అఖండ జ్యోతి రథయాత్ర సోమవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా నేరడిగొండ గ్రామంలోని పెద్ద హనుమాన్ ఆలయం వద్ద గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. పవిత్రమైన అఖండ జ్యోతి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు ఆలయానికి తరలివచ్చారు. మహిళలు, యువత, వృద్ధులు భక్తి శ్రద్ధలతో జ్యోతిని దర్శించుకొని ధర్మ స్థాపనకు ఇది మంచి సూచకంగా భావిస్తూ పూజలు చేశారు. అనంతరం గ్రామంలో భక్తి గీతాలతో కూడిన ప్రదర్శనలు, దీపారాధనలు, ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే



సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో పాటు ఆయా గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారు. సోమవారం మండలంలోని బొడ్డిగూడ, దుబ్బగూడ, కేస్లాగూడ, వాగాయితండా గ్రామాల్లో వైద్య సిబ్బంది సందర్శించి ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. జ్వరంతో పాటు ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్యం అందించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్స్ తిరుమల, ల్యాబ్ టెక్నీషియన్లు ప్రణీత, జ్యోతిక, ఏఎన్ఎంలు సేవంత, చంపా పాల్గొన్నారు.

సవార్ల షెడ్డు ప్రారంభం

ఇచ్చోడ: మండలంలోని జల్దా గ్రామంలో సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సవార్ల షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కులమతాలకు అతీతంగా గ్రామాల్లో మొహర్రం పండుగలు జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, కృష్ణారెడ్డి, గజనంద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుంటుకలకు డిమాండ్

- కలుపుతీత పనుల్లో రైతన్నలు బిజీ
- కాడెద్దులు, గుంటుకల కొరత
- రోజుకు రూ.1500 నుంచి రూ.2 వేలు సంపాదన



వడ్డాడిలో గుంటుకతో కలుపు తీస్తున్న రైతు

తాంసి: వ్యవసాయ పనులు చేపట్టేందుకు ఆధునిక యంత్రాలు ఎన్ని వచ్చినా.. వ్యవసాయ పనుల్లో కొన్ని పనులకు మాత్రం కాడెద్దులు, గుంటుకలు అవసరం ఎంతో ఉంది. ప్రస్తుతం రైతులు సాగుచేసిన పత్తి, కంది, సోయా పంటలు కలుపు తీసే దశలో ఉన్నాయి. పంటచేలో కలుపుతీత పనులకు ఎక్కువ మంది రైతులు కాడెద్దుల ద్వారా గుంటుకలతో కలుపు తొలగిస్తున్నారు. దీంతో గ్రామాల్లో కాడెద్దులు, గుంటుకలు ఉన్న రైతులకు ఫుల్ డిమాండ్ నెలకొంది.

రైతులకు ఫుల్ డిమాండ్..

మండలంలో రైతులు అధికంగా వర్షాధార పంటలైన పత్తి, కంది, సోయా పంటలు సాగు చేస్తారు. పంటలను అనుగుణంగా వర్షాలు కురియడంతో పంటచేలలో ఏపుగా కలుపు మొక్కలు పెరిగాయి. వర్షాలు సమృద్ధిగా కురియడంతో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. అలాగే ఎరువులతో పాటు రసాయన మందులు పిచికారీ చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో చాలా మంది రైతులు పశుపోషణ లేక వ్యవసాయంలో ట్రాక్టర్లను, యంత్రాలను వినియోగిస్తున్నారు. పశుపోషణ లేక ఒకసారిగా రైతులు పంటచేల్లో కలుపుతీత పనులు చేపట్టడంతో కాడెద్లకు, గుంటుకలకు డిమాండ్ పెరిగింది.

రోజుకు రూ.2 వేలు..

కలుపుతీత పనులు కొనసాగడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కాడెడ్లు ఉన్న రైతులను ఆశ్రయిస్తున్నారు. రోజుకు రూ.1500కు పైగా డబ్బులు తీసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో అధికంగా ఎద్దులు లేకపోవడంతో కొద్ది రోజులు ఆగాల్సి వస్తోంది. కొందరు రైతులు కాడెడ్లు ఉన్న రైతులకు ముందస్తుగా డబ్బులు చెల్లించి వ్యవసాయ పనులు చేస్తున్నారు.

దొరకడం లేదు



వర్షాలు వరుసగా కురవడంతో పత్తిలో కలుపు విపరీతంగా పెరుగుతుంది. కలుపు మొక్కలను తొలగించడానికి తప్పనిసరిగా పత్తి కర్రల మధ్యలో గుంటుక వేయాల్సి ఉంటుంది. కలుపు తీసేందుకు యంత్రాలు సైతం పెద్దగా అందుబాటులో లేక గుంటుకపై ఆధారపడాల్సి వస్తోంది.

– రాహుల్ రెడ్డి, యువరైతు

కలుపుతీతకు ప్రాధాన్యం



పంటచేల్లో కలుపు విపరీతంగా పెరిగింది. తప్పని సరిగా గుంటుకతో కలుపు తీయాల్సి ఉంటుంది. కాడెడ్లు, గుంటుకలు అవసరం ఎక్కువ. గుంటుకల కోసం ముందస్తుగా డబ్బులు సైతం చెల్లిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు రూ.1500 నుంచి రూ.2వేలు ఇస్తున్నారు.

– అలాలి అశోక్, రైతు, తాంసి

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



తాంసి: పీరీలను దర్శించుకుంటున్న బోథ్ ఎమ్మెల్యే



సాత్నాల: పీరీలను ఊరేగిస్తున్న ప్రజలు

తాంసి: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తాంసి, బండల్‌నాగాపూర్, కప్పర్ల, పొన్నారి, హస్నాపూర్, గిరిగాం, వామన్‌నగర్ సావర్గాం గ్రామాల్లో మొహర్రం పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో పీరీలను డప్పుచప్పుల మధ్య ఊరేగించారు. యువత డప్పుచప్పుళ్లకు అనుగుణంగా నృత్యం చేస్తూ.. పీరీల గుండం వద్ద అసైదుల్లా అంటూ ఆటలు ఆడారు.

పీరీలను దర్శించుకున్న ఎమ్మెల్యే..

మండలంలోని బండల్‌నాగాపూర్, కప్పర్ల గ్రామాల్లో మొహర్రం వేడుకల్లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. గ్రామాల్లో సవారీ బంగ్లాల వద్ద పూజలు నిర్వహించి పీరీల ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం ప్రజలతో కలిసి నృత్యం చేసి సందడి చేశారు.

నేరడిగొండ: మొహర్రం పండుగ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం మండలంలోని వడూర్ గ్రామంలో పీరీలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రాస్తులతో కలిసి పీరీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. స్థానిక ప్రజలతో కలిసి గుండం ఆడి ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరిపారు. గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.

భీంపూర్: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం ముగింపు ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పలు వీధులలో పీరీలను డప్పుల చప్పుళ్ల మధ్య భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఈ సందర్భంగా పలువురు యువకుల వేషధారణ అందరినీ ఆకట్టుకున్నాయి. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

సాత్నాల: మండలంలోని జామ్ని గ్రామంలో పీరీల పండుగను ఆదివాసీలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పీరీలను ఊరేగిస్తూ, మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టుపక్కల గ్రామ ప్రజలు వర్షం సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో పీరీలను దర్శించుకున్నారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రంతో పాటు దేగామ, గిర్నూర్, పిప్రి, కొలారి, భూతాయి గ్రామాల్లో సోమవారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పీరీలను పూజించి, మొక్కులు చెల్లించుకున్నారు. కోలాటం, సాంప్రదాయ నృత్యం చేశారు.

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో సోమవారం మొహర్రం ముగింపు వేడుకలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో పీరీల ఊరేగింపులో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని శాంతి నగర్, తిర్పెల్లి, శ్రీరామ్ కాలనీ, కేఆర్కే కాలనీ అందంగా అలంకరించిన సవారీలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలువురు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పట్టణ వీధుల్లో ఆధ్యాత్మిక సంతరించుకుంది.

కార్పొరేషన్ ద్వారా వేతనాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

కైలాస్‌నగర్: రిమ్స్, సూపర్ స్పెషలిటీ ఆసుపత్రుల్లో పని చేస్తున్న శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ గార్డు కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. కృష్ణ ఏజెన్సీ టెండర్ గడువు గత నెల 30న ముగిసిందన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు కొత్తగా టెండర్లు పిలువలేదన్నారు. కార్మికులకు రూ.32వేల కనీస వేతనం చెల్లించాలన్నారు. యూనియన్ నాయకులు సంగీత, ఖాసీం, సంతోష్, పద్మ, కమలమ్మ పాల్గొన్నారు.

పల్లకి ఊరేగింపు

ఇంద్రవెల్లి: తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని విఠోబా, దత్తసాయి ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విఠోబా పల్లకిని ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం తొలి ఏకాదశి ఉపవాస దీక్షలు విరమించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.



పల్లకి ఊరేగిస్తున్న భక్తులు

రాజురలో వైద్య శిబిరం

నేరడిగొండ: నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని రాజుర గ్రామంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి రవణీత, ఆశ కార్యకర్త లావణ్య పాల్గొన్నారు.

కొలాంగూడలో

బజార్‌హత్నూర్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ భీంరావ్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కొలాంగూడలో వైద్య శిబిరం నిర్వహించారు. 40 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు, ఈగల బెడద లేకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సుశీల, సూపర్‌వైజర్ రవీందర్, హెల్త్ అసిస్టెంట్ రమేశ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

పండ్ల తోటల పెంపకంపై శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఉద్యాన పరిశోధన స్థానం ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన రైతులకు పండ్ల తోటల పెంపకంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు కొండలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త మురళి ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి, జామ, నేరెడు, డ్రాగన్‌ఫ్రూట్ తదితర మొక్కలను గృహ ప్రాంగణం, వ్యవసాయ భూముల్లో నాటేందుకు ఉచితంగా అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 10లోగా రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 73861 37417 సంప్రదించాలన్నారు.

నేరడిగొండ ఎస్సైగా ఇమ్రాన్



ఇమ్రాన్

నేరడిగొండ: నేరడిగొండ ఎస్సైగా ఇమ్రాన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఎస్సైగా పనిచేసిన శ్రీకాంత్ గుడిహత్నూర్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని టూటౌన్ నుంచి బదిలీపై నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాధ్యతలు తీసుకున్నారు. శాంతిభద్రతలను కాపాడేందుకు మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు సహాయ సహకారాలు అందించాలని ఇమ్రాన్ కోరారు.

వర్షం నీటిలోనే పాఠశాలకు విద్యార్థులు



వర్షం నీటిలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. వర్షం పడితే చాలు పాఠశాలకు వెళ్లే దారి వరద నీటితో నిండిపోతుంది. దాదాపుగా 12 వందల మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారు. పాఠశాలకు వెళ్లే దారిలో వర్షంనీరు అగకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాలలో మాక్ పార్లమెంట్ ఎన్నికలు



ఎన్నికలను పరిశీలిస్తున్న ఏటీడీవో అమిత్

బజార్‌హత్నూర్: పాఠశాలల్లో విద్యార్థులచే మాక్ పార్లమెంటు ఎన్నికలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు భారత రాజ్యాంగ శాసన, కార్యనిర్వహక, న్యాయ వ్యవస్థలపై అవగాహన కలుగుతుందని ఏటీడీవో అమిత్ అన్నారు. సోమవారం మండలంలోని గిరిజన బాలుర ఆదర్శ క్రీడా పాఠశాలలో విద్యార్థులు మాక్ పార్లమెంటు, స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ అధికారులు, ఓటర్లు, పోటీలో ఉన్న అభ్యర్థులు పాత్రలను పోషించారు. ఈ ఎన్నికలను ఏటీడీవో అమిత్ పరిశీలించారు. అనంతరం ఎన్నికల ఫలితాలు ప్రకటించి విజేతను ప్రకటించారు. ప్రధానోపాధ్యాయులు కిషన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రయథ్లాన్ విజేతకు సన్మానం

జాతర్ల గిరిజన బాలుర ఆదర్శ క్రీడా పాఠశాలలో విద్యార్థి 9వ తరగతి చదువుతున్న కే.జకేష్ ఆదివారం వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ట్రయథ్లాన్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ సందర్భంగా సోమవారం జాతర్ల ఆదర్శ క్రీడా పాఠశాలలో ఏటీడీవో అమిత్ కే.జకేష్‌ను శాలువాతో సత్కరించారు.

మొక్కలతోనే మానవ మనుగడ



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలంటే చెట్లు చాలా ముఖ్యమన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థి



విద్యార్థిని సన్మానిస్తున్న రూపేష్ రెడ్డి

కైలాస్‌నగర్: బేల మండలంలోని సాంగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సామ రేవంత్ రెడ్డి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. రైతు కుటుంబానికి చెందిన సదరు విద్యార్థి పదో తరగతిలో 600 మార్కులకు గాను 540 మార్కులు సాధించాడు. జిల్లా స్థాయిలో మెరుగైన ర్యాంకు సాధించి బాసర ట్రిపుల్ ఐటీలో చోటు దక్కించుకున్నాడు. సోమవారం ఆ విద్యార్థిని యువజన కాంగ్రెస్ నాయకులు జిల్లా కేంద్రంలో శాలువాతో సత్కరించారు. యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి, రాకేశ్, రంజిత్ రెడ్డి, కృష్ణ, మేకల జితేందర్, గణేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఇచ్చోడ: కేక్‌కట్ చేస్తున్న నాయకులు

నేరడిగొండ: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం మండల కేంద్రంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించి, మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గజ్జల శంకర్ మాదిగ మాట్లాడుతూ అలుపెరుగని పోరాటాలతో షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ సాధించి, సామాజిక న్యాయం, ఆత్మగౌరవానికి బాటలు వేసిన మహానేత మందకృష్ణ మాదిగ అని కొనియాడారు. సింగారపు లస్మన్న, గోనే ఆడేల్లు, గజ్జల అశోక్, గసికంటి కిష్టయ్య, సారంగ్, రవి, గజ్జల భోజన్న, గజ్జల మోహన్, చిర్ర రమేశ్, గజ్జల నర్సయ్య, సుంచు రవి, గజ్జల గంగాధర్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీస్ ఆవిర్భవ దినోత్సవన్ని ఘనంగా నిర్వహించారు. 30 సంవత్సరాల ఉద్యమంలో కుల సంఘాలు, వివిధ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు కృషి చేసినందుకు ఎమ్మార్పీఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేష్, దుబాక సుభాష్, సిరిసిల్ల భూమయ్య పాల్గొన్నారు.

నార్నూర్: మండల కేంద్రంతో పాటు గంగాపూర్, మాన్కాపూర్, గుంజాల, భీంపూర్, తాడిహత్నూర్ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. గత మూడున్నర దశాబ్దాలుగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ షెడ్యూల్ కులాల వర్గీకరణ తో పాటు అనేక సామాజిక సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో రాథోడ్ రమేశ్, విష్ణు, రాజు, జ్ఞానేశ్వర్, కృష్ణ, సీతారాం దిగంబర్, చెప్పకుర్తి విజయ్, తిరుమలేష్ పాల్గొన్నారు.

భీంపూర్: మండలంలోని కరంజి(టీ) గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడు పంజాబ్ పార్టీ జెండా ఆవిష్కరించారు. మాదిగ, అనుబంధ ఉపకులాలు ఐక్యంగా ఉద్యమించి అభివృద్ధిని సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, అశోక్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఎమ్మార్పీఎస్ మండల నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఆందారే బాలాజీ పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్‌రావ్, కాంబ్లే బాలాజీ, ఉప్పులేటి శ్రీనివాస్, లింగంపల్లి రాజన్న, నర్సింగ్‌రావ్, స్వామి పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: సొనాల మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ కసిరె చిన్నయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఎంపీ నగేశ్ బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. చిన్నయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన సుకుల్ ప్రేంసింగ్ లక్ష్మిల కుమారుడు తరుణ్ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ సోమవారం మండల కేంద్రానికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీ వెంట కొత్త శంకర్, సుఖ్‌దేవ్, నానం రమణ, అల్కే గణేష్, నంది నర్సయ్య, నాగనాథ్, జాంసింగ్ ఉన్నారు.

సన్మానం

బోథ్: బోథ్ డివిజన్ ఆత్మ చైర్మన్‌గా నియమితులైన గొర్ల రాజు యాదవ్‌ను మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన యాదవ సంఘం నాయకులు సోమవారం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బీరం రవి, ఉపాధ్యక్షుడు శంకర్, కోశాధికారి కొండయ్య, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

నేరడిగొండ: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని బోరిగావ్ గ్రామానికి చెందిన పవార్ కల్యాణికి రూ.16,500, బోథ్ మండల కేంద్రానికి చెందిన ఇఫ్రా అంజుమ్‌కు రూ.9వేల చెక్కులు మంజూరు కాగా వాటిని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రీజియన్ అకౌంట్స్ ఆఫీసర్‌గా రమేశ్

ఆదిలాబాద్: ఆర్టీసీ రీజియన్ అకౌంట్స్ ఆఫీసర్‌గా లోకల రమేశ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అసిస్టెంట్ మేనేజర్ ఫైనాన్స్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొంది ఆర్ఎం కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. పదోన్నతితో బాధ్యతలు స్వీకరించడంపై సిబ్బంది అభినందనలు తెలిపారు.